

వన్ క్లిక్‌తో ఈపీఎఫ్ సొమ్ము

అత్యవసర సమయంలో ఆన్‌లైన్‌లోనే ఈపీఎఫ్ సొమ్మును విత్ డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది.అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేస్తే కొద్ది రోజుల్లోనే నగదు జమ అవుతుంది. - 8లో



టీచర్లకు పారిటీ స్కేల్ ఇవ్వాలి

గురుకుల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.6^{0} /16.2^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు



మహబూబాబాద్ రూరల్: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ అందజేస్తున్నారు. ఈమేరకు సోమవారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మానుకోట ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్, హిమబిందు, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమా, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, సుజాత దంపతులకు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక కృష్ణమోహన్ అందజేశారు. కార్యక్రమంలో వంకాలపాటి లెనిన్ బాబు, రాజేష్, పున్నంచంద్ మాల్పాని, కాచువల్ శ్యాంసుందర్ శర్మ, జయప్రకాష్ లోయ, వేణు లోయ, గోవింద్ ఖండేల్వాల్, పద్మ కలంత్రి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, శ్రీధర్, అశోక్, రావుల నవీన్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ద్వారా అయోధ్య అక్షింతలు, శ్రీరామ మందిర చిత్రం ఆహ్వాన పత్రాన్ని పంపిణీ చేశారు.

గార్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి



గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో శాతవాహన, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరుతూ సోమవారం మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితకు పలు పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌కు ఏటా సుమారు రూ.కోటి ఆదాయం వస్తుందని, ప్రయాణికుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించాలని, నిలిపివేసిన పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ కవిత గార్ల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ రాంచంద్రునాయక్, ము రళి, బిక్కు, భిక్షపతి, రమేష్‌నాయక్, సురేష్‌నాయక్, ప్రభాకర్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆన్‌లైన్‌లోనే సైన్స్‌ఫేర్

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి ద్వారా డీఎల్‌బీవీపీ పేరుతో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. బాల వైజ్ఞానిక ప్రదర్శన 2023–24 ప్రధాన శీర్షిక 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ' 'ఉప శీర్షికలు' ఆరోగ్యం, లైఫ్ (పర్యావరణం కోసం జీవనశైలి), వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై సైన్స్‌ఫేర్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించారు. అన్ని యాజమాన్యాల ఆరో తరగతి నుంచి పది వరకు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు వివిధ గురుకులాల నుంచి 6 నుంచి 12వ వరకు విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ఆన్‌లైన్‌లో ప్రదర్శించే అవకాశం ఉంది. ఈనెల 5 వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి సోమవారం తెలిపారు.

విద్యార్థులకు సైన్స్ సెమినార్..

సైన్స్‌ఫెయిర్‌ను పురస్కరించుకొని ప్రతీ ఏటా నిర్వహించే సైన్స్ సెమినార్‌ను కూడా ఆన్‌లైన్‌లోనే ప్రదర్శించనున్నారు. సెమినార్ అంశం 'మిల్లెట్స్ ఫర్ హెల్త్ అండ్ సస్టయినబుల్ ప్లానెట్'. ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించే ఆన్లైన్ (డీఎల్‌బీవీపీ) కోసం ప్రదర్శనలను 5వ తేదీలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు. ఏమైనా సందేహాలుంటే హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి 94901 12848 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పనుల్లో వేగం పెంచాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో చేపట్టిన పలు పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మేడారంలో కలెక్టర్ సోమవారం పర్యటించారు. బయ్యక్కపేటలోని సమ్మక్క గుడిని సందర్శించి పరిశీలించారు. శానిటేషన్ పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మేడారంలో శానిటేషన్ స్టోర్ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి ఆదేశించారు. ఐటీడీఏ అతిథిగృహంలో పార్కింగ్ స్థలాలు, పనుల పురోగతికి సంబంధించి ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎండోమెంట్, ఈజీఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కట్టడికి కట్టుదిట్టం!

గంజాయి రవాణాకు జిల్లా కేంద్ర బిందువు

- ఇక్కడి నుంచే వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్రకు తరలింపు
- సాగు కట్టడి చేసినా.. ఆగని రవాణా
- మత్తులో తూగుతున్న యువత
- సీఎం ఆదేశాలతో పోలీసుల అప్రమత్తం



పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)



సాక్షి, మహబూబాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గంజాయి సాగుకు మానుకోట కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. మారిన పరిస్థితులు, అధికారుల ప్రత్యేక దృష్టితో గంజాయి సాగును అరికట్టడంలో పోలీస్, ఎక్సైజ్‌శాఖలు సఫలమయ్యాయి. అయితే ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు.. జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం, జిల్లాలో గంజాయి మహమ్మారికి బానిసలై పెడదారి పడుతున్న యువకుల సంఖ్య పెరగడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.

జిల్లా మీదుగా రవాణా..

యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న గంజాయి రవాణాకు మానుకోట జిల్లా అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, జనగామ జిల్లాల సరిహద్దులు ఉన్నాయి. కాగా ఏపీతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిస్సా ప్రాంతల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా జిల్లాలోని ఏజెన్సీలోకి గంజాయి రవాణా చేస్తున్నారు. జిల్లా సరిహద్దు మండలాలైన గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం మీదుగా గంజాయి స్మగ్లర్లు జిల్లాలో ప్రవేశిస్తున్నారని సమాచారం. ఇతర ప్రాంతాల స్మగ్లర్లకు జిల్లాకు చెందిన కొందరు తోడు కావడం, వారికి సహకరించడంతో జిల్లా మీదుగా రోడ్డు మార్గంలో వరంగల్, సూర్యాపేట, జనగామ మీదుగా హైదరాబాద్, మహారాష్ట్ర తోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నట్లు ప్రచారం. అదేవిధంగా జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం రైల్వే స్టేషన్లకు చేరుకోవడం అక్కడి నుంచి రైలు మార్గం ద్వారా మహానగరాలకు దర్జాగా గంజాయిని సరఫరా చేస్తున్న సంఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. గత రెండేళ్లలో జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న 60 మందిని అరెస్టు చేసి 441 కేజీల మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.

యువత బానిస..

యువత గంజాయిని వివిధ రూపాలుగా మార్చి తాగుతున్నారు. మార్కెట్‌లో దొరికే ఎడిషన్, గరం సిగరెట్లను ఖాళీ చేసి అందులో గంజాయి నింపి నేరుగా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. అదేవిధంగా గంజాయితో కూడిన ప్యాకెట్లను కూడా రూ. 50, నుంచి రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని సదరు యువకులు కొనుగోలు చేసి బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లి సిగరెట్లు లేదా పేపర్‌తో రోల్‌ను తయారు చేసి అందులో గంజాయి నింపి తాగుతున్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలతో తయారు చేసిన చాక్లెట్లు, యాష్ లిక్విడ్ వంటి రూపాల్లో మహబూబాబాద్ జిల్లాలో దొరుకుతుందనే ప్రచారం. ఇలా జిల్లా కేంద్రంలోని పత్తిపాక, హనుమంతుని గడ్డ, సిగ్నల్ కాలనీ, సలార్‌తండా ప్రాంతాలతోపాటు డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, నర్సింహులపేట, తొర్రూరు, కేసముద్రం ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పలువురు యువకులు చెబుతున్నారు. గంజాయి ఆకు, పువ్వు, లిక్విడ్‌ను జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు, భద్రాచలం, అరకు వంటి ప్రాంతాల నుంచి రైళ్లు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా జిల్లాకు తీసుకొస్తున్నారు. విక్రయ కేంద్రాల్లో గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేయడం అక్కడి నుంచి కిరాణం, కిల్లీ, ఇతర దుకాణాల ద్వారా యువతకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పోలీసులకు సవాల్..

జిల్లాలో గంజాయి విక్రయాలపై కూడా రాష్ట్రస్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం మరింత అప్రమత్తమైనట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసిన ఎస్పీ గంజాయి మరకను చెరిపేలా పనిచేయాలని ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా సరిహద్దు మండలాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని చెక్ చేయాలని చెప్పినట్లు తెలిసింది. ఇతర నిఘా వర్గాలను కూడా ఏర్పాటు చేసి గంజాయి రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



జిల్లా మీదుగా గంజాయి సరఫరా అవుతున్న విషయంపై ప్రత్యేక నిఘా పెట్టాం. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతీ వాహనాన్ని చెక్ చేయడం, అనుమానితులను విచారించే పనిలో ఉన్నాం. యువత భవిష్యత్‌ను అంధకారం చేస్తున్న గంజాయి నిర్మూలనకు జిల్లా ప్రజలు సహకరించాలి.

– సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎస్పీ

'నూతన' సందడి



స్వామి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు



బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు



సీఎస్ఐ చర్చిలో సందేశం ఇస్తున్న రెవరెండ్ ఫాదర్ ధర్మయ్య

- ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్‌లు
- ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణంలోని పలు దేవాలయాలు, చర్చిల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఫాదర్ బి.ధర్మయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలు చర్చిల్లో వేడుకలను జరుపుకున్నారు. వేణుగోపాల స్వామి దేవాలయం, సీతారామచంద్రస్వామి దేవాలయం, అనంతాద్రి జగన్నాథ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్యాత్మిక సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమా దంపతులు, స్థానిక కౌన్సిలర్ గుండా స్వప్నపోతురాజు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరీ భవన్‌లో మార్వాడీ యువ మంచ్, సఖి మండలి, మార్వాడీ సమాజ్ సభ్యులు కేక్‌కట్ వేడుకలు జరుపుకున్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఏటూరునాగారం: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకొని ఎక్కువ మొత్తంలో జాబ్‌మేళాను నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అధికారులతో నూతన సంవత్సరం సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. వివిధ కంపెనీలలో నిరుద్యోగ గిరిజన యువత ప్లేస్‌మెంట్ల కోసం ప్రముఖ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ మండల స్థాయిలో జాబ్ మేళాలను నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించాలని జాబ్‌మేళా జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని మారుమూల, అంతర్గత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఎంసీహెచ్ బృందాలతో సమన్వయం చేసుకోవాలని ప్రాజెక్ట్ మేనేజర్, నేషనల్ హెల్త్ మిషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, రీజనల్ కోఆర్డినేటర్ ఆగస్టిన్, అకౌంట్స్ మేనేజర్ నర్సింగ్, జాబ్ జిల్లా మేనేజర్ కొండల్‌రావు, ఎన్‌హెచ్‌ఎం ప్రాజెక్టు మేనేజర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందిస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరులో న్యూఇయర్ వేడుకల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి వ్యక్తి వరకు అందడమే లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. న్యూఇయర్ సందర్భంగా సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి దంపతులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. సందర్శకులు పుస్తకాలు, పూల మొక్కలు ఎమ్మెల్యేకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని, దానికి స్థానికులు సహకారం అందించాలన్నారు. యువత భవితకు ప్రాధాన్యమిస్తానని, దానికి మండలంలోని గుర్తూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందని, ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, నరేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, మేరుగు మల్లేశం, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలి

- ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



ఎస్పీకి కేక్ తినిపిస్తున్న అడిషనల్ ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: పోలీసు అధికారులు, సిబ్బంది నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అనారు. మానుకోటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఎస్పీ సోమవారం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గడిచిన ఏడాదిలో పోలీసుశాఖలో అధునాతన సాంకేతికతను అందించామన్నారు. ఇది సిబ్బంది పూర్తిస్థాయి విధి నిర్వహణకు ఎంతో దోహదపడిందన్నారు. పోలీస్ అధికారులకు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు చట్టపరిధిలో పరిష్కారం చేస్తూ ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ ప్రజలకు మరింత చేరువ అవ్వాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారి సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకుని సహకరించాలన్నారు. తరచూ ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో చేసే పనితో పాటు ఆరోగ్యం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నార. వచ్చే ఎన్నికలకు సంసిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు విజయప్రతాప్, తీర్థాల సత్యనారాయణ, గంద్రాతి మోహన్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు సోమవారం మేడారానికి భారీగా తరలివచ్చారు. దీంతో వనదేవతల ప్రాంగణం కోలాహలంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అమ్మవార్ల గద్దెల వద్ద తీరొక్క పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజును దర్శించుకున్నారు. నూతన సంవత్సరంలో శుభాలు కలగాలని భక్తులు అమ్మవార్లకు పూజలు చేశారు. మేడారం ఈఓ రాజేంద్రం అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. అదే విధంగా మేడారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం కొత్త సంవత్సరం రోజున దర్శించుకుంటే అన్ని శుభాలే కలుగుతాయని నమ్మకంతో తరలివచ్చి సమ్మక్క–సారలమ్మకు మొక్కుకున్నారు. దేవాదాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించారు.

అన్ని అనుమానాలే..

ప్రజాపాలన దరఖాస్తులపై ప్రజల సందేహాలు

- సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు
- పూర్తి వివరాలు పొందుపర్చడంలో లబ్ధిదారుల తర్జనభర్జన



తొర్రూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. అయితే అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు నింపమనడంతో ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లబ్ధి పొందుతున్న ఏ పథకాలకు కోత పడుతుందోననే అనుమానంతో సరైన వివరాలు ఇవ్వడం లేదు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకానికి సంబంధించి ఒకే దరఖాస్తు పత్రం తీసుకువచ్చారు. కాగా వివరాలు రాసే సమయంలో ప్రజలకు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా అంశాల్లో స్పష్టత లేకపోవడంతో అధికారులు సైతం సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

ఈ సందేహాలకు సమాధానాలేవి?

- మహాలక్ష్మి పథకంలో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళకు(కుటుంబంలో ఒకరికి) నెలకు రూ. 2500 ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశం. రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో చాలామంది ఆందోళన చెందుతున్నారు. పెళ్లయిన ఆడపిల్లలు తమ ఆధార్ కార్డులో భర్త ఇంటి పేరుతో పాటు చిరునామాలు మార్చుకున్నారు. ఇంటి పేరు మారడం, అత్తగారింట్లో రేషన్ కార్డులో పేరు లేకపోవడంతో ఏం రాయాలో తెలియక పథకం వస్తుందో...రాదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రైతు భరోసా పథకానికి...యజమాని పేరుతో దరఖాస్తు చేస్తే ఇంట్లో మిగిలిన వారి పేరు మీద ఉన్న సర్వే నంబర్లు ఎలా ఇవ్వాలో తెలియడం లేదు. కౌలు తీసుకున్న రైతులు దరఖాస్తులు నింపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతు నుంచి కౌలు అగ్రిమెంట్ లేకపోతే దరఖాస్తు చేయాలా వద్దా అన్న విషయం తెలియడం లేదు. పదెకరాలు ఉన్న రైతు మరో ఐదెకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. రెండు కలిపితే 15 ఎకరాలు అవుతుంది. దీంతో ఏ పథకానికి ఎసరు పడుతుందోనని భయపడుతున్నారు.
- గృహజ్యోతి పథకంలో సొంత ఊరిలో కాకుండా పలువురు పట్టణాల్లో పనిచేస్తూ అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. అలాంటి వారికి అద్దె ఇంట్లో ఉన్న విద్యుత్ కనెక్షన్‌కు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందో లేదో తెలియడం లేదు. ఆధార్ కార్డులో ఉన్న ఇంటికి పరిమితి చేస్తారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు, మూడు మీటర్లు ఉన్నవారు దరఖాస్తు చేయాలా లేదా అన్న సందేహం ఉంది.
- ఇందిరమ్మ ఇళ్ల పథకంలో...ఇల్లు లేని వారికి ఆర్థిక సహాయం అనే కాలమ్ పెట్టారు. గ్రామాల్లో చాలా వరకు రెండు, మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉంటారు. వీరందరికి ఒకే చిరునామా ఉంటుంది. ఒకరికి ఇచ్చి మిగిలిన వారిని తిరస్కరిస్తారేమో అన్న భయం పట్టుకుంది.
- రేషన్ కార్డు లేనోళ్లు ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు ఫారంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జతచేయాలని చెప్పడంతో తమకు ఈ పథకాలు దక్కవని ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ, కఠిన, సేవా పతకాలకు ఎంపిక



ఎన్.హరినారాయణ, డీసీఆర్బీ హెడ్ కానిస్టేబుల్



జి.గోపిచంద్, ఆర్ఎస్సై

మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీసుశాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్ఎస్సై, ఎస్సై, ఇద్దరు ఏఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్ మొత్తంగా ఐదుగురిని ఉత్తమ సేవా పతకం, కఠిన సేవా పతకం, సేవా పతకాలకు ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. ఉత్తమ సేవా పతకానికి డీసీఆర్బీ హెడ్ కానిస్టేబుల్ ఎన్.హరినారాయణ (ప్రస్తుతం అటాచ్డ్ టు ఖమ్మం పోలీసు కమిషనరేట్), కఠిన సేవా పతకానికి ఆర్ఎస్సై జి.గోపిచంద్ (ప్రస్తుతం అటాచ్డ్ టు ములుగు స్పెషల్ పార్టీ), సేవా పతకాలకు పీసీఆర్ ఎస్సై ఎండీ.సత్తార్, పీసీఆర్ ఏఎస్సై ఎస్.కే.అహ్మద్, కురవి ఏఎస్సై జె.సదయ్య ఉన్నారు. ఉత్తమ, కఠిన, సేవా పతకాలను రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా వారికి అందజేయనున్నారు.

రూ.50కోట్ల మాంసం అమ్మకాలు





మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో న్యూవేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత కేక్‌లు కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. అలాగే డిసెంబర్ 31 ఆదివారం రావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు మటన్, చికెన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపించింది. జిల్లాలో సుమారు 2,500 టన్నుల చికెన్ అమ్మకాలు జరుగగా.. సుమారు రూ .45 కోట్ల ఆదాయం, అలాగే రూ.5కోట్ల మటన్ అమ్మకాలు జరిగినట్లు షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. ముందే ఈవెంట్లు ఫిక్స్ చేసుకున్న వారితో పాటు తోటలు, చెరువుల గట్ల వద్ద గొర్రె మేకపోతులను వధించారు.

రూ.3కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు

మహబూబాబాద్ రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ. 3కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలిసింది. కేవలం ఒక్క ఆదివారంరూ. 2.11కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

జిల్లాలోని 59 వైన్సుల్లో జరిగిన మద్యం అమ్మకాలు ఆ విధంగా ఉండగా ఇక బార్లు, రెస్టారెంట్లు, బెల్టు షాపుల్లో జరిగిన మద్యం విక్రయాలు చూస్తే శనివారం రోజునే మద్యం ప్రియులు ముందస్తుగా కొనుగోలు చేసి తీసుకువెళ్లినట్లు గుర్తించవచ్చు. నూతన సంవత్సరానికి ముందే మద్యం విక్రయాలు రూ.1.50 కోట్ల వరకు జరిగి ఉండవచ్చని అంచనా. మొత్తంగా రూ. 3కోట్లపైచిలుకు మద్యం అమ్మకాలు జరిగాయి.

కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

హన్మకొండ కల్చరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ఓరుగల్లు పద్య నాటక, సాంఘిక నాటక, సినీకళాకారులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాకారులు తమ గత అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గత ఏడాది వరంగల్ పేరును నిలిపేలా వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చామని, ఈ సంవత్సరంలోనూ ఓరుగల్లు కీర్తిని చాటేలా ముందుకు తీసుకెళ్తామన్నారు.

క్లుప్తంగా

శిశువులకు గ్రాండ్ వెల్‌కం..

- న్యూ ఇయర్ రోజు జనగామ ఎంసీహెచ్‌లో ఎనిమిది మంది జననం



శిశువుతో వైద్య సిబ్బంది

జనగామ: జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్ మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో నూతన సంవత్సరం తొలిరోజు సోమవారం ఎనిమిది మంది శిశువులు జన్మించారు. ఇందులో రెండు సాధారణ ప్రసవాలు, ఆరు సిజేరియన్లు అయ్యాయి. నలుగురు చొప్పున మగ, ఆడ శిశువులు జన్మించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్త సంవత్సరం రోజు పురుడు పోసుకున్న శిశువులను చూసి తల్లిదండ్రులు మురిసి పోయారు.

సామూహిక జన్మదిన వేడుకలు



కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన 21మంది బాలికల సామూహిక జన్మదిన వేడుకలను హెచ్‌డబ్ల్యూఓ బి.పద్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. కార్యక్రమంలో పీడీ అనిల్‌కుమార్, ఏఎస్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

రైల్వే స్టాల్స్ వెండర్స్‌కు అవగాహన



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే స్టాల్స్ వెండర్స్, సూపర్‌వైజర్లకు సోమవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు మాట్లాడుతూ రైల్వే స్టాల్స్‌పై అమ్మకాలు చేసే వారు, ప్లాట్‌ఫారాలపై అమ్మకాలు చేసే వారు ఐడీ కార్డు, పోలీస్, మెడికల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులకు సహాయం, సలహాలు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రయాణికులు మరిచిపోయిన లగేజీలు, సెల్‌ఫోన్లు రైల్వే పోలీసులకు అప్పగించాలన్నారు. రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వార్డు మెంబర్ మృతి



రాజు(ఫైల్)

దుగ్గొండి: రైలు ప్రమాదంలో వార్డు సభ్యుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొబ్బరోనిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కొత్తపల్లి రాజు(35) కొద్ది కాలంగా హైదరాబాద్‌లో ఓ కంపెనీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రైలులో ఇంటికి బయలుదేరాడు. టికెట్ తీసుకోకుండా ఎక్కడంతో బీబీనగర్ ప్రాంతంలో టీటీకి పట్టుబడ్డాడు. దీంతో రైలు దూకాడా లేదా మరే కారణమో తెలియదు గాని ప్రమాదం జరిగి మృతి చెందాడు. మృతదేహం సోమవారం ఇంటికి చేరింది. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని సర్పంచ్ శంకేషి శోభాకమలాకర్, వార్డు సభ్యులు సందర్శించి నివాళులర్పించారు.



వన్ క్లిక్‌తో ఈపీఎఫ్ సొమ్ము

ఆన్‌లైన్‌లో నగదు డ్రా చేసుకునే వెసులుబాటు

- దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగక్కర్లేదు
- అన్ని వివరాలు సక్రమంగా నమోదైతే కొద్దిరోజుల్లోనే విత్ డ్రా
- ప్రయోజనం పొందడానికి సులభ మార్గం

ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగికి అక్కరకు వచ్చే నిధి. ఇటు ఉద్యోగి, అటు సంస్థ సహకారంతో పొదుపు చేసుకునే భవిష్యత్ నిధి. అత్యవసర సమయంలో ఈపీఎఫ్ సొమ్ము కొంత మొత్తం లేదా పూర్తిగా విత్ డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. ఇన్నాళ్లు ఇందుకు మ్యాన్యువల్‌గా దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి వచ్చేది. ఆన్‌లైన్ వ్యవస్థ అమల్లోకి వచ్చిన అనంతరం ఆ అవసరం లేకుండా పోయింది. ఇంట్లో కంప్యూటర్, నెట్ సదుపాయం ఉంటే చాలు.. ఆన్‌లైన్‌లోనే అన్ని పనులు పూర్తి చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఈపీఎఫ్ ఎలా విత్‌డ్రా చేసుకోవాలి..? దరఖాస్తు వివరాలు, తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

కాజీపేట: ఈపీఎఫ్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఉద్యోగి తన పొదుపు మొత్తం సొమ్మును వాడుకునే అవకాశం లభించింది. దాచుకున్న పొదుపు నుంచి కొంత నగదును వాడుకోవచ్చు. ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవడానికి చాలా నిబంధనలున్నాయి. ఇందు కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. దీని వల్ల ఉద్యోగికి సకాలంలో సొమ్ము అందుతుందనే నమ్మకం ఉండేది కాదు. ఆర్థిక అవసరాలు తీరక అవస్థలు పడేవారు. అయితే ఆన్‌లైన్ సదుపాయం అందుబాటులోకి వచ్చాక ఎంతో వెసులుబాటు కలిగింది. రుణాలు తీసుకోవడం, పీఎఫ్ సొమ్ము ఉపసంహరణ వంటి పనులు సులువయ్యాయి. ఈ విధానంతో ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

సౌకర్యాలు ఇలా పొందాలి...

- ఇంట్లో కంప్యూటర్, ఇంటర్ నెట్ సౌకర్యం ఉన్న వారు పీఎఫ్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి హోం పేజీలోకి వెళ్లాలి.
- కుడి పక్కన ఆన్‌లైన్ క్లెయిమ్ అనే పదం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే పేజీ కనిపిస్తుంది.
- లాగిన్ అయిన తర్వాత యూఏఎన్ నంబర్ ఎంటర్ చేస్తే ఫారాలు కనిపిస్తాయి. ఈ పీఎఫ్ నంబర్‌ను ప్రభుత్వం ఖాతాదారులకు కేటాయిస్తుంది.
- ఇందులో లాగిన్ అయిన తర్వాత ఐదు ఆప్షన్లు కనబడతాయి. వీటి ద్వారా పీఎఫ్ సొమ్ము ఎంత ఉంది తెలుసుకోవచ్చు.
- మేనేజ్ అనే దానిపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయొచ్చు.
- ఈ మేనేజ్ అనే ఆప్షన్‌లో కేవైసీ వివరాలను నమోదు చేయాలి. కేవైసీ అంటే ఆధార్, ఇతర గుర్తింపు వివరాలు.
- అకౌంట్ అనే చోట పాస్‌వర్డ్‌ను నమోదు చేయాలి.



- కొత్త పాస్‌వర్డ్ నమోదు చేసుకోవాలన్నా ఇందులో అవకాశం ఉంటుంది.
- ఆన్‌లైన్ సర్వీస్ ముఖ్యమైంది. దీనిని క్లిక్ చేయడం ద్వారా దాచుకున్న సొమ్మును పొందడానికి అవకాశం కలుగుతుంది.
- ట్రాన్స్‌ఫర్ క్లెయిమ్, ట్రాన్స్‌ఫర్ టికెట్ అనే రెండు ఆప్షన్ల ద్వారా దాచుకున్న నగదును విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది.
- స్టేటస్ అనే ఆప్షన్ ద్వారా వివరాలు, ఇతర అంశాలను నమోదు చేసుకోవచ్చు.
- ఇందులో క్లెయిమ్ ఆప్షన్ నొక్కితే ఒక పేజీ కనిపిస్తుంది. ఇందులో పీఎఫ్ ఖాతాదారుడి పేరు, వివరాలు, ఆధార్ నంబర్లు నమోదు చేయాలి. ఈ వివరాలు నమోదు చేయగానే పీఎఫ్ ఖాతా సక్రమంగా ఉందో లేదో తెలిపి అప్‌డేట్ అవుతుంది.
- ఈ వివరాల ఆధారంగా వెరిఫికేషన్ పూర్తవుతుంది. ఆ తర్వాత నగదు తీసుకునే అవకాశం కలుగుతుంది.
- ఉద్యోగి తన కేవైసీ నమోదు సరిగా చేయకపోతే వెబ్‌సైట్‌లో సరి చేసుకునే అవకాశం ఉంది. ఈ విధంగా సరి చేసుకున్న తర్వాత లైన్ క్లియర్ అవుతుంది.
- డబ్బులు తీసుకోవడానికి డాక్యుమెంట్ రకాన్ని అడుగుతుంది. లోపల పార్ట్‌పేమెంట్ వంటి ఆప్షన్లకు వివిధ రకాల డాక్యుమెంట్లు ఉంటాయి. వీటి ఆధారంగా కావాల్సిన డాక్యుమెంట్లు ఎంపిక చేసుకోవాలి.
- ఈ విధంగా ఎంపిక చేసుకున్న తర్వాత ఉద్యోగి బ్యాంకు పాస్ బుక్ నంబర్, ఐఎఫ్‌సీ కోడ్, ఆధార్ నంబర్ వంటివి నమోదు చేయాలి. నమోదు ప్రక్రియ పూర్తికాగానే వాటి వివరాలు వెరిఫికేషన్ చేసి సక్రమంగా ఉంటే ఓకే అని వస్తుంది.
- అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాత సేవ్ ఆప్షన్ అనే దానిని క్లిక్ చేయాలి.
- అన్ని పూర్తి చేసిన తర్వాత ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సర్వీస్‌లోకి వెళ్లి క్లెయిమ్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈ విధంగా చేయడంతో మొత్తం ప్రక్రియ పూర్తయినట్లే.
- ఈ విధంగా సక్రమంగా నమోదు చేసిన తర్వాత పది రోజుల్లో ఉద్యోగి అందించిన బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ అవుతుంది.

ప్రయోజనాలు ఇవీ..

- అధికారుల చుట్టూ తిరుగాల్సిన ఇబ్బంది ఉండదు.
- దరఖాస్తులను అందించి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి ఎదురు చూడాల్సిన పని ఉండదు.
- అన్ని సక్రమంగా ఉంటే దరఖాస్తు సమర్పించిన వారం రోజుల్లో క్లెయిమ్ చేసుకున్న మొత్తం అందుతుంది.
- మధ్యవర్తులు లేకుండా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి నేరుగా జమ అయిపోవడం వల్ల అవకతవకలకు, అవినీతికి అవకాశం ఉండదు.
- ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని దాచుకున్న సొమ్మును విత్ డ్రా చేసుకునే సదుపాయం వల్ల ఇతరుల నుంచి ఈ సొమ్ముపోతుందన్న ప్రమాదం ఉండదు.
- ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్‌లకు దాచుకున్న ఈ పీఎఫ్ సొమ్ము మినహాయింపునకు అవకాశం కలుగుతుంది.
- పీఎఫ్ ఖాతాదారులుగా ఉన్న ఉద్యోగులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ ఖాతాలో ఉన్న సొమ్ముని తామే తీసుకునే సదుపాయం ఏర్పడుతుంది.
- గతంలో ఉన్న అవకతవకలకు ఆస్కారం లేకుండా ఈ విధానం ఎంతో అనుకూలంగా ఉంటుంది.

నకిలీ 'రేషన్' దరఖాస్తులు!

- సోషల్ మీడియాలో వైరల్

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం పేరిట గత నెల 28వ తేదీ నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ఒకే దరఖాస్తును స్వీకరిస్తోంది. దరఖాస్తులు ఉచితంగా పంపిణీ చేస్తున్నా కొరత దృష్ట్యా కొందరు ప్రైవేటు వ్యక్తులు, జిరాక్స్ కేంద్రాల నిర్వాహకులు అక్రమ దందాకు తెరలేపారు. ఒక్కో దరఖాస్తుకు రూ.20–50 వరకు వసూలు చేస్తున్న విషయం అధికారుల దృష్టికి రాగా ...ప్రైవేటు వ్యక్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే కొత్త రేషన్ కార్డు కోసం విడిగా తెల్ల కాగితంపై రాసిన దరఖాస్తులను గ్రామ సభల్లో తీసుకుంటున్నారు. ఇదే అదనుగా కొందరు సోషల్ మీడియాలో అచ్చం అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తు నమూనాతో తప్పుడు దరఖాస్తును వైరల్ చేశారు. అదే నిజమైన దరఖాస్తుగా భావించి ప్రజలు జిరాక్సు కేంద్రాలకు పరుగులు పెట్టడం ప్రారంభించారు. ఆ దరఖాస్తులను పలు చోట్ల సమర్పించేందుకు ప్రయత్నించగా అధికారులు తిరస్కరించడం కనిపించింది. ఈ విషయంపై తొర్రూరు తహసీల్దార్ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వం రేషన్‌కార్డు కోసం ప్రత్యేక దరఖాస్తును రూపొందించలేదన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది తప్పుడు దరఖాస్తు అని పేర్కొన్నారు. ప్రజలు జిరాక్స్ కేంద్రాలకు వెళ్లి వాటిని తీసుకుని దరఖాస్తు చేయొద్దని తెల్పిచెప్పారు. రేషన్ కార్డు పేరిట దరఖాస్తులను ముద్రించి విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేంద్రాలను మూసివేస్తామన్నారు.



వాట్సాప్‌లో వైరల్ అవుతున్న రేషన్ దరఖాస్తు నమూనా

విద్యార్థుల సాహితీ యాత్ర



సోమనాథుడి స్మృతివనంలో విద్యార్థులు

- పాలమూరు నుంచి పాలకుర్తికి..

పాలకుర్తి టౌన్: తెలుగు సాహిత్య చరిత్రలో పాల్కురికి సోమన, బమ్మెర పోతనల ముద్ర భద్రమైనదని ప్రముఖ సాహితీవేత్త, పాఠ్యపుస్తక రచయిత పల్లెర్ల రామమోహన్‌రావు అన్నారు. 'సాహితీ యాత్ర'లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా వేముల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాలను సందర్శించి దర్శనీయ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ మహాకవుల గురించి పాఠ్యపుస్తకాలలో చదవటమే కాకుండా వారి స్వస్థలాల సందర్శన సరికొత్త ప్రేరణ అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కవులు రచించిన పద్యాలను వారిచే సామూహికంగా గానం చేయించారు. కార్యక్రమంలో సోమనాథ కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, శంకరమంచి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు బి.రాజేశ్వర్, ఉపాధ్యాయులు గోపాల్, రాజశేఖర్, శ్రీకాంత్, శ్రీనివాస్, బాలరాజు, నాగరత్నం, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం..

న్యూ ఇయర్ విషాదం.. హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- పాలకుర్తి, బచ్చన్నపేట మండలాలకు చెందిన ఇద్దరి విద్యార్థుల దుర్మరణం
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు



భరత్ చందర్(ఫైల్)



నితిన్(ఫైల్)

పాలకుర్తి టౌన్ /బచ్చన్నపేట : ఆ ఇద్దరు యువకుల నేపథ్యం వేరు. ఒకరంటే మరొకరికి పరిచయం లేదు. వేర్వేరు ప్రాంతాల్లో జన్మించారు. వేర్వేరు చోట్ల పాఠశాల విద్యనభ్యసించారు. ఉన్నత విద్య మాత్రం ఒకే చోట ఒకే కళాశాలలో చదువుతున్నారు. అక్కడే స్నేహితులయ్యారు. ఒకరంటే ఒకరికి ప్రాణం. కళాశాలకు వెళ్లినా, సరదా కోసం బయటకు వెళ్లినా ఇద్దరు కలిసే బయలుదేరుతారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వీరి స్నేహం చూస్తే అసూయ కలుగుతుంది. అంతలా కలిసున్న వీరి స్నేహాన్ని మరణం కూడా వీడదీయలేకపోయింది. హైదరాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకుర్తి, బచ్చన్నపేట మండలాలకు చెందిన ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. దీంతో చేతికందొచ్చిన కుమారులు కనిపించని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవపురం గ్రామానికి చెందిన రాఘం రాజన్న, రజిత దంపతుల కుమారుడు భరత్ చందర్(19), జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలీంపూర్‌కు చెందిన చెందిన పాకాల సంతోష, కిష్టయ్య దంపతుల రెండో కుమారుడు నితిన్(18) హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో బీటెక్ చదువుతున్నారు. ఇద్దరు స్నేహితులు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా భరత్ చందర్, నితిన్.. కేక్ కొనుగోలు చేయడానికి స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పటాన్‌చెరు సమీపంలో జాతీయ రహదారిపై స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో భరత్‌చందర్, నితిన్ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో చేతికందిచ్చిన కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. మృదేహాలను స్వగ్రామాలకు తీసుకురావడంతో గ్రామస్తులు తరలివచ్చి బోరున విలపించారు. కాగా, ఈ ఘటన జరిగిన కొద్ది గంటల క్రితం భరత్ చందర్, నితిన్ తమ తమ కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి మాట్లాడారని, ఇంతలోనే మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించిందని గ్రామస్తులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

- తీవ్ర గాయాలు.. ఎంజీఎంకు తరలింపు
- ఎస్‌ఆర్‌ఆర్‌తోట చిన్న బ్రిడ్జి వద్ద ఘటన



తీవ్రంగా గాయపడిన సద్దాం

ఖిలా వరంగల్ : మద్యం మత్తులో యువత రోడ్డుపై హల్‌చల్ చేసింది. సినీ ఫక్కీలో ఆటో, బైకులపై 14 మంది చేరుకుని బీభత్సం సృష్టించారు. ఏమి చేస్తున్నారని ప్రశ్నించినందుకే ఓ వ్యక్తిపై ఇటుకలు, బీరు బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. అనంతరం అటుగా వస్తున్న పోలీస్ వాహనం సైరన్ విని క్షతగాత్రుడిని వదిలేసి పరారయ్యారు. ఈ ఘటన ఎస్‌ఆర్‌ఆర్‌తోట చిన్న బ్రిడ్జి రహదారిపై జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి గ్రామానికి చెందిన ఎండి. సద్దాం హుస్సేన్, ఎండి. అష్రఫ్ అలీ అన్నదమ్ములు. ఏడు ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో కలిసి శివనగర్‌కు చేరుకున్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలో ట్యాక్సీ కార్లు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. న్యూఇయర్ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి ఎస్‌ఆర్‌ఆర్‌తోట చిన్న బ్రిడ్జి సమీపంలో కార్ల పార్కింగ్ స్థలం వద్ద డ్రైవర్లతో కలిసి సద్దాం, అష్రఫ్ కేక్ కట్ చేశారు. ఇంతలో ఇంటి వద్ద నుంచి అష్రఫ్ కాల్ వచ్చింది. దీంతో బైక్‌పై చిన్న బ్రిడ్జి నుంచి శివనగర్‌లోని ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో కింద పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సద్దాం కాల్ చేయగా ఘటనా స్థలికి చేరుకున్న అతను.. తన అన్న అష్రఫ్‌ను ఆటోలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడే మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు సద్దాంను దుర్భాషలాడారు. దీంతో మీరు ఎవరని ప్రశ్నించగానే క్షణాల్లో సినీ ఫక్కీలో ఆటో, మూడు బైక్‌లపై 14 మంది చేరుకున్నారు. రావడంతోనే సద్దాంపై ఇటుక, బీరు బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో సద్దాంకు తీవ్ర గాయాలయ్యారు. అనంతరం అతడే తేరుకుని మిల్స్‌కాలనీ సీఐ సురేష్ గౌడ్‌కు కాల్ చేశారు. వెంటనే ఎస్సై రాజు, సిబ్బంది వెంకన్న ఘటనా స్థలికి వస్తున్నారు. వీరిని గమనించిన 14 మంది పరారవుతుండగా ఇందులో సద్దాం ఇద్దరి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం సద్దాంను ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్ ఇవ్వాలి

- టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్

విద్యారణ్యపురి: గురుకుల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్ ఇవ్వాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మైనారిటీ గురుకుల ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురుకులాలను కామన్ డైరెక్టరేట్ పరిధిలోనికి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించుకోకూడదన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌లో కేర్ టేకర్లను నియమించాలన్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. మైనార్టీ గురుకులాలల్లో డైట్ చార్జీలు పెంపుదల చేయాలన్నారు. మైనార్టీ గురుకులాల్లో ఉపాధ్యాయలపై అడ్మిషన్ల భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, తాటికాయల కుమార్, సృజన్‌ప్రసాద్‌రావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, గురుకుల ఉపాధ్యాయ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, బాధ్యులు సౌజన్య, లక్ష్మినారాయణ, సదానందం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

టీఎస్ యూటీఎఫ్ మైనార్టీ గురుకులాల విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.భిక్షపతి, ఉపాధ్యక్షులుగా ఎండి రహీం, ప్రధాన కార్యదర్శిగా కె.నళిని, కోశాధికారిగా షకీల్ అహ్మద్ , కార్యదర్శులుగా శివాజీ, యాస్మిన్, ఎం.శిరీష, పి.రాజ్‌కుమార్, ఎం.సౌజన్య, ఎన్ రమేష్, ఎ.సబిత, ఎ.రజితలు ఎన్నికయ్యారు.

ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ముందుకు సాగాలి

- సికింద్రాబాద్ డివిజన్ నేతలు వీరన్న, కేఎన్.రావు



కృత్రిమ విజయ్‌స్తంభ్ వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో సోమవారం 1818 జనవరిలో జరిగిన మహార్ వీరుల వీరోచిత పోరాట పటిమను గుర్తుచేసుకునే విధంగా కృత్రిమంగా ఏర్పాటు చేసిన పూనేలోని బీమా కోరెగావ్ విజయ్ స్తంభ్ వద్ద విజయోత్సవ సభ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం రైల్వే ఆస్పత్రి సీనియర్ డీఎంఓ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు సమక్షంలో న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రైల్వే అధికారులు, సూపర్‌వైజర్లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్సీ ఎస్టీ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, ఏడీ ఎస్‌ఈలు కేఎన్.రావు, మాట్లాడుతూ 1818లో జరిగిన 500 మంది మహార్ వీరుల పోరాట పటిమ ఘటనను ఆదర్శంగా తీసుకొని ఎస్సీ, ఎస్టీలు హక్కుల కోసం సంఘటితం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు ఆర్.కుమారస్వామి, బాలరాజు, నరేష్, మురళీకృష్ణ, రెడ్డి శ్రీనివాస్, లేబ్రాజ్‌మీనా, ఎం.శ్రీనివాస్, వీరస్వామి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



నరేశ్(ఫైల్)

కాటారం: ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని దేవరాంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన కుసుమ నరేశ్(28) స్థానికంగా ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై ఫోన్ మాట్లాడుతూ వెళ్లాడు. రాత్రి సమయంలో చనిపోతున్నానని వీడియో తీసి స్టేటస్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. స్టేటస్ చూసిన పలువురు నరేశ్ బాబాయ్ అశోక్, సోదరుడు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. నరేశ్ కోసం ఆరా తీయగా చివరకు శంకరాంపల్లి సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం దగ్గరలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇప్పగూడెంలో యువతి..

స్టేషన్‌ఘన్‌పూర్: పెళ్లి సంబంధం కుదిరి మూడు రోజులు కాకముందే పెళ్లి కుమారుడు అనుమానం వ్యక్తం చేయడంతో అవమానంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో జరిగింది. యువతి తండ్రి లింగసబోయిన సోమయ్య ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పగూడేనికి చెందిన సోమయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకూతురు వసంత(19) ఎంపీసీ సెకండియర్ చదువుతోంది. 10 రోజుల క్రితం రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన నర్సింగుల సత్తయ్య కుమారుడు హరీష్‌తో పెళ్లి సంబంధం మాట్లాడుకుని రూ. 20 వేలు కట్నంగా ఇచ్చాడు. డిసెంబర్ 31న రాత్రి తమ ఇంటికి హరీష్‌తో పాటు మరో వ్యక్తి వచ్చి మమ్మల్ని లేపి మీ బిడ్డ వసంత నిత్యం వేరే వారితో మాట్లాడుతుందని నేను ఆమెతో మాట్లాడాలన్నారు. రాత్రి ఎందుకు పొద్దున మాట్లాడువు అన్నా వినలేదు. దీంతో తమ బిడ్డను లేపగా ఇద్దరు కొద్దిసేపు మాట్లాడుకున్నారు. అనంతరం మీ బిడ్డ ఎవరితోనే మాట్లాడుతుందని నేను పెళ్లి చేసుకోనని చెప్పాడు. పెళ్లి సంబంధం కుదిరాక ఇలా అంటే మాబిడ్డ పరిస్థితి ఏమిటని అడుగగా చావమని అంటూ వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురై వసంత సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆ సమయంలో పక్క ఇంటికి చెందిన ముప్పిడి నరేష్ చూసి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. తన కూతురు ఆత్మహత్యకు బాధ్యుడైన హరీష్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోటలో పర్యాటకుల సందడి..



మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఖిలా వరంగల్ : చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటకు సోమవారం భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని ఇతర జిల్లాలు, నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అద్భుతమైన శిల్ప సౌందర్యాలను తిలకించారు. కోటలోని స్వయంభూ శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయంలో పర్యాటకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శిల్పసంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను తిలకించారు. అనంతరం పిల్లాపాపలతో చేరుకున్న పర్యాటకులు ఏకశిల చిల్డ్రన్ పార్క్‌లో పచ్చని చెట్లనీడన సేదతీరారు.

అదుపు తప్పిన కారు

- స్పాట్‌లోనే ఇద్దరు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- అందరూ వరంగల్ వాసులే..

మహబూబాబాద్ రూరల్ : ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన ఘనటలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డ తండా సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని శివనగర్ ప్రాంతానికి చెందిన సాయితేజ, మట్టెవాడ ప్రాంతానికి చెందిన పాక లక్ష్మణ్, సంగినేని సాయిరాం, వెంగళదాసు సాయిరాం, రవితేజ అందరూ కలిసి కారులో తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు ఏటిగడ్డ తండా సమీపంలోకి చేరుకుంటుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో వెంగళదాసు సాయిరాం, రవితేజ అక్కడికక్కడే మృతి చెందారు. సంగినేని సాయిరాం, పాక లక్ష్మణ్, సాయితేజలకు తీవ్ర గాయలు కాగా చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. టౌన్ సీఐ వై.సతీష్, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృతి చెందిన రవితేజ తండ్రి గుగ్గిళ్ల రామకృష్ణాచారి హనుమకొండ ఏసీబీలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు.